




## *గాంధీగారి దేశంలో గజానికో గాంధారి కొడుకుంటే...!*

**ఫోను రింగయింది.**

"హలో" అన్నాను రిసీవర్ ఎత్తి.

"హలో..నేనేనండీ" అవతల్నించి గొంతు వినిపించింది. ఆ గొంతు గుర్తుపట్టి – 'హలో – నమస్తే' అన్నాను.

"ఓసారి మా ఆఫీసుకి రాగలరా?" అడిగారాయన.

"అలాగే" రిసీవర్ పెట్టేశాను.

ఆ తర్వాత ఓ గంటకు 'సితార' ఆఫీసు చేరుకున్నాను.

"మీ కోసమే ఎదురు చూస్తున్నాను" అంటూ ఆహ్వానించారు అసోసియేట్ ఎడిటర్.

"ఇది చూడండి" నేను కూర్చున్న తర్వాత బల్లమీద వున్న ఓ కవరు తీసి నా చేతికి అందించారాయన.

"ఏమిటిది?" అడిగాను.

"డియర్ సితార శీర్షికలో ప్రచురించమని రాశారెవరో. చూడండి" కవరులో వున్న కాగితం బయటకు తీసి చదివాను.

"సితార ఎడిటర్ గారికి నమస్కారములు. మీ పత్రికలో వారం వారం వస్తున్న 'వెండి తెర సాక్షిగా' చదువుతున్నాను. చాలా ఆసక్తిదాయకంగా నడుస్తోంది. అందులో పరిశోధకుడు చెప్పినట్టుగా 'మంజులత'లాంటివారు ఎందరో వున్నారు. వెండితెర జిలుగు వెలుగుల్లో ఓ వెలుగు వెలగాలన్న తాపత్రయంతో పడరాని పాట్లు పడిన సోదరీమణులు ఎంతోమంది చీకటి జీవితాలు గడుపుతున్న మాట యదార్థం. మీరు చెప్పినట్లుగా సినిమాల్లో చేరాలనుకోవటం, అందుకు ఆశపడటం 'మత్తు'తో కూడినవే. అదొక కలల ప్రపంచం. ఆ కలల ప్రపంచంలో కాలు పెట్టి జారిపోయి కల చెదిరిపోయి, తమ జీవితాన్ని నాశనం చేసుకునే ఇడపడుచులు మన చుట్టూ ఎందరో వున్నారు. వారి బతుకుల వెలుగులోకి తెచ్చి మరెవరూ ఊబిలో కూరుకుపోకుండా జాగ్రత్తపడేందుకు ఈ శీర్షిక ద్వారా అవసరమైన సలహాలు అంద చేస్తున్న మీకు తోటి సోదరీమణుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

"ఇలాంటి శీర్షికను అయిదేళ్ళ క్రితమే ప్రచురించి వుంటే – నా బ్రతుకు ముళ్ళబాట అయ్యేది కాదు. నా గురించిన వివరాలు 'వెండితెరసాక్షిగా' శీర్షికలో రాస్తే స్వార్థపరుల ప్రలోభాలకు లొంగిపోయి తమ జీవితాల్ని చేజేతులా నరక ప్రాయం చేసుకునే నాబోటి అక్కలకూ చెల్లెళ్ళకూ – మేలుకొలుపుగా వుంటుంది. నా అడ్రస్ క్రింద రాస్తున్నాను.

**ఇట్లు**

**శోభ.**

ఉత్తరంలో క్రింది భాగాన వున్న అడ్రస్ వైపు ఆసక్తిగా చూశాను.

అది హైదరాబాదు అడ్రస్. నా కళ్ళు సంతృప్తితో మెరిసాయి. వెండి తెరమీదకు ఎక్కి వెలలేని సంపాదనని వేనోళ్ళ పొగడ్తల్నీ పొందాలని ఆశపడే అమ్మాయిలకు ఆ వెండితెర వెలుగుల వెనుక ఎంతటి గాఢాంధకారం వ్యాపించి వుంటుందో తెలియ చెప్పాలని 'సితార'తో కలసి చేస్తున్న చిన్ని ప్రయత్నానికి ఎటువంటి ప్రతిస్పందన కలుగుతోందో గమనించిన నాకు ఎంతో ఆనందం కలిగింది. నిజానికి సినీమారంగం మంచిదికాదని చెప్పటం కానీ - ఇక్కడంతా చీకటే చోటు చేసుకుంటుందని చెప్పడం కానీ మా వుద్దేశ్యం కానేకాదు. ఇందులో అప్పుడప్పుడు అక్కడక్కడ ఎదురయ్యే ఎత్తుపల్లాల గురించీ తగిలే ఎదురు దెబ్బల గురించీ సినీమాల్లో చేరాలనుకుని ఆశతో పరుగెత్తుకొచ్చే అమ్మాయిలకూ, అబ్బాయిలకూ - ఒక చిన్న 'హెచ్చరిక'లా తెలియ చెప్పాలనే నా ప్రయత్నం.

"ఈ ఉత్తరం 'సితారలో' ప్రచురిస్తారా?" అని అడిగాను.

ఉత్తరం ప్రచురించటం ఎందుకూ? ఏకంగా ఆమె ఇంటర్వ్యూ వేద్దాం. మీరు వెళ్ళి ఇంటర్వ్యూ చేయండి" అన్నారు అసోసియేట్ ఎడిటర్.

మర్నాడు సాయంత్రం మూడు గంటలకు లెటర్‌లో ఆమె రాసిన అడ్రస్ ప్రకారం బాలానగర్ బయలుదేరాను. డోర్ నంబర్లు ఒక వరుస క్రమంలో లేకపోవటం వల్ల ఇల్లు పట్టుకోవటం కొంచెం కష్టమైంది.

నాలుగు వీధులు తిరిగిన తర్వాత ఒక చోట నాకు కావలసిన ఇంటి నంబరు కనిపించింది. అదొక చిన్న డాబా ఇల్లు. చుట్టూ కాంపౌండ్ వాల్ గేటు తీసుకుని లోపలకు అడుగుపెట్టాను.

ఇరుపక్కలా రంగు రంగుల గులాబీ పూల మొక్కలు కనిపించాయి. ఎదురుగా వరండాలో ఓ మధ్య వయస్కురాలు కాఫీ తాగుతూ కూర్చుంది.

"నమస్తే!" తటపటాయించి చూస్తూ "విష్" చేశాను. ఆమె పరిస్థితి కూడా నాలాగే వుంది.

"శోభగారంటే"

ఆమె ముఖకవళికలు ఇట్టే మారిపోయాయి

"దేనికి?" కసురుతున్నట్టుగా అడిగింది.

"సితార పత్రిక నించి వచ్చాను. ఇంటర్వ్యూ చేసి పత్రికలో రాద్దామని."

"అక్కర్లేదు. మీరు వెళ్ళచ్చు" కటువుగా అన్నదామె.

అంటే ఆమె శోభ కాదన్న సంగతి అర్థమైంది.

"ఇంతకీ శోభంటే!? "ఎవరో తెలుసుకోవాలన్న నా కుతూహలం కొద్దీ అడిగాను.

"మా అమ్మాయే! జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు మళ్ళీ ఇంటర్వ్యూలూ ఫోటోలు అంటూ గడచిపోయిన పీడకలను గుర్తు చేయకండి" అంటూ ఇక మాట్లాడేదేమీ లేదన్నట్టు కుర్చీలోంచి విసురుగా లేచి ఇంట్లోకి నడవబోయిందామె.

"శోభగారే రమ్మని ఉత్తరం రాశారు మేడం" అన్నాను.

ఆమె చటుక్కున ఆగిపోయింది. ఈలోగా నా జేబులో వున్న ఉత్తరం తీసి ఆమె చేతికి అందించాను. దాన్ని గబగబా చదివించి ఆమె.

"ఏం ప్రశ్నలడుగుతారు?" ఉత్తరాన్ని మడతపెట్టి నా చేతికి తిరిగి ఇచ్చేస్తూ అడిగింది.

"ఇంకా నిర్ణయించుకోలేదు. అసలు శోభగారు ఏం చెప్పదల్చుకున్నారో విన్న తర్వాత మేం అడగవలసినవి ఏవైనా వుంటే అడుగుతాం."

"సరే.. మా గురించి ఇష్టం వచ్చినట్టు రాయకండి. మర్యాదగా బ్రతుకుతున్నవాళ్ళం. మా పరువు తీసింది చాలక. ఇంకా వివరాలు కూడా చెప్తుందట మహాతల్లి.. రండి" అని విసుక్కుంటూ లోపలకు నడిచిందామె.

నేను ఆమెను అనుసరించాను.

ఇద్దరం ఎడం పక్కనే వున్న ఓ గదిలోకి వెళ్ళాం.

"కూర్చోండి కాఫీ తీసుకొస్తాను" ఓ కుర్చీని మంచం దగ్గరగా లాగి వెళ్ళిపోయిందామె.

మంచం మీద పడుకుని రేడియో వింటున్న వ్యక్తిని చూసి షాకయ్యాను. చూడగానే భయం కలిగించేలా వుంది ఆమె ఆకారం. చేతులూ, కుడిచెంప, మెడ క్రింద భాగం కాలిపోయినట్టుగా కనిపిస్తోంది. జుట్టు కూడా ఒక వైపు లేకపోవటం వల్ల వికృతంగా వుంది.

"మీరేనా శోభగారు?" అడిగాను - మరేం అడగాలో తెలియక.

"అవును.. మీరు..?"

"సితారకి మీరు రాసిన ఉత్తరం చూసి - మిమ్మల్ని ఇంటర్వ్యూ చేద్దామని వచ్చాను" కుర్చీలో కూర్చుంటూ చెప్పాను.

ఆమె ఉత్సాహంగా లేచి కూర్చుంది.

"అంటే 'వెండితెర సాక్షి'గా రాస్తున్నది మీరేనా?" అడిగింది.

"అవును.."

"మిమ్మల్ని కలవటం నాకు సంతోషంగా వుంది. నా వుత్తరం చూసి నా కథ తెలుసుకునేందుకు వస్తారని అనుకున్నాను. కానీ ఇంత తొందరగా వస్తారని అనుకోలేదు" రేడియో ఆఫ్ చేసి - పక్కనే వున్న బల్లమీద పెట్టింది.

నేను ఆమెవైపు అలాగే తదేకంగా చూస్తున్నాను. మహావుంటే ఆమెకు పాతికేళ్ళు వుండచ్చు. ముఖం వికారంగా వున్నా కళ్ళు మాత్రం చాలా అందంగా మెరిసిపోతూ కనిపిస్తున్నాయి. పాలమీగడలాంటి శరీరచ్ఛాయ.

అంతటి అందమైన పిల్లకు - వళ్ళెలా కాలిందో? "ఏమిటలా ఆలోచిస్తున్నారు? నన్నూ, నా రూపాన్నీ చూసి భయపడుతున్నారా?" అడిగింది చిరునవ్వుతో.

"అదికాదు. మీకీ ప్రమాదం ఎలా సంభవించి వుంటుందా అని ఆలోచిస్తున్నాను."

"ఖర్మ!" అదే నవ్వు.

ఆ నవ్వు వెనకాల అంతర్లీనంగా విషాదపు ధ్వనులేవో వినిపించాయి.

"మీ ఉత్తరాన్ని బట్టి చూస్తే మీరు అయిదేళ్ళ క్రితం ఎప్పుడో సినీమాల్లో చేరాలనుకున్నట్టూ, ఆ ప్రయత్నంలో మోసపోయినట్టూ అర్థమవుతోంది" అన్నాను.

"నిజమే చాలా దారుణంగా మోసపోయాను. నాలాంటిది అసలు బతక్కూడదు. కానీ దేవుడు చాలా గొప్పవాడుకదండీ. ఎవర్నెందుకు ఈ భూమ్మీద వుండిపొమ్మంటాడో, ఎవర్ని తొందరగా తన దగ్గరకు రమ్మంటాడో ఎవరూ చెప్పలేరు" మరో కుర్చీని నా దగ్గరకు లాక్కుని కూర్చుంటూ చెప్పింది.

"మీరు చదువుకున్నారా?" ఆ ప్రశ్న అడగటం అనవసరమని తెలిసి కూడా ఎందుకు అడిగానో నాకే తెలీదు.

ఆ ఇంటినీ ఇంట్లో వాతావరణాన్ని గమనించి చూస్తే ఆ కుటుంబం 'అబౌవ్ మిడిల్ క్లాస్' అని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. అటువంటి కుటుంబానికి చెందిన ఆడపిల్ల చదువుకోకుండా ఎలా వుంటుంది?

"బి.ఎస్సీ పాసయ్యాను సార్. డాన్స్ నేర్చుకున్నాను" చెప్పింది శోభ. సరిగ్గా అదే సమయంలో శోభ తల్లి కాఫీ తెచ్చి మా ఇద్దరికీ ఇచ్చింది.

"సినీమా పిచ్చిలోపడి బంగారంలాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంది. చివరికిలా ప్రాణం మీదకి తెచ్చుకుని వీధి మొహం చూడకుండా చీకట్లో బతుకుతోంది. ఇంకా పేపర్లో రాసి దాని బతుకు రచ్చకెందుకీడుస్తారూ? అలా వదిలేయండి బాబూ?" అంది ఆవిడ.

నేను ఏం మాట్లాడాలో తెలియక ఇబ్బంది పడ్డాను. "నేను నీకు కన్నబిడ్డను కనుక నీ దృష్టిలో బతికున్నాను. కానీ నా దృష్టిలో, లోకం దృష్టిలో నేను ఎప్పుడో చచ్చిపోయానమ్మా! నాకు ఎందుకీ గతి పట్టిందో. నాలాగా తొందరపాటుతో అడ్డమైన గాడిదల్నీ నమ్మి మోసపోకుండా వుండేందుకు అందరూ తెలుసుకోవాలి" ఆవేశంగా అంది శోభ. ఆవిడ మరేమీ మాట్లాడకుండా గదిలోంచి బయటకు వెళ్ళిపోయింది.

"క్షమించాలి. మా అమ్మా, నేనూ రోజూ ఇలా దేనికో ఒకందుకు మాటా మాటా అనుకుంటూనే వుంటాంలెండి. మీరేమీ అనుకోకండి. మా అమ్మకి నేనంటే ప్రాణం. నేను ఎందుకూ పనికిరానని తెలిసినా లక్షరూపాయలు ఖర్చు పెట్టి నన్ను బతికించుకుంది. అయినా నన్ను చూసి అపుడపుడూ గుండెలు పగిలేలా ఏడుస్తూంటుంది. నేనిలా బతికుండి ఏడిపిస్తున్నానా అనుకుంటూంటాను. చచ్చిపోతే ఒక్కసారే ఏడుస్తారు. తర్వాత కొంత కాలానికి మర్చిపోతారు. కానీ బతికుంటే రోజూ ఇదే వరుస."

ఆమె అలా వరస పెట్టి మాట్లాడేస్తోంది. నాకు అసలు విషయం ఏమిటో స్పష్టంగా అర్థం కావటంలేదు.

"ఇంతకీ మీరు సినీమాల్లో వేషాలు వేశారా?" టాపిక్‌ని డైవర్ట్ చేయాలన్న ఉద్దేశంతో అడిగాను. "ఉండండి" అంటూ లేచి గోడవారగా వున్న బీరువాలోంచి ఓ ఆల్బం నాకు అందించింది. ఆత్రుత కొద్దీ పేజీలు తిరగేశాను. అవన్నీ శోభ తాలుకు ఫోటోలే. కొన్ని ఫోటోలు డాన్స్ భంగిమల్లో వున్నాయి. మరికొన్ని ప్రముఖులైన సినీమా తారలతోనూ, దర్శకులతోనూ తీయించుకున్నవి.

నేను ఒక్కటొక్కటే ఆల్బంలో ఫోటోలు చూస్తూంటే అవి ఏ సందర్భంలో తీయించుకున్నదీ వివరించింది.

చివర్లో ఒక ఫోటోపై నా దృష్టి నిలిచింది.

అందులో వున్న ఓ నలభై ఏళ్ళ యువకుడు శోభ భుజం మీద చేయి వేసి నిలబడ్డాడు.

"ఎవరితను?" అని అడిగాను.

"ఎవరీయన?" అని అడిగి వుండాల్సిందని వెంటనే అనుకున్నాను.

"నా జీవితాన్ని సర్వనాశనం చేసిన బ్రోకరు వాడే" పళ్ళు పిండుకుంటూ చెప్పింది శోభ.

నాకు కొంత అర్థమైంది అసలు విషయం. ఫోటోలో వ్యక్తిని 'ఎవరీయన' అని సంబోధించినందుకు క్షణం ముందు నొచ్చుకున్న మనసు ఆమె చెప్పింది విన్నాక కొంచెం తేలికపడినట్లయింది.

ఆమె అసలు విషయంలోకి వస్తోందని గ్రహించాను. నా హేండ్‌బ్యాగ్‌లో వున్న నోట్ పుస్తకం, బాల్ పెన్నూ తీసుకున్నాను.

"ముందు మీ ఫాదర్ పేరు చెప్తారా?" అడిగాను నోట్ బుక్ తెరచి రాసుకునేందుకు ఉద్యుక్తుణ్ణి అవుతూ.

"సారీ! వాళ్ళ గురించి ఏమీ అడక్కండి. ఇలాంటి పాపిష్టి దాన్ని ఇంకా నెత్తిన పెట్టుకుని గౌరవిస్తున్న వాళ్ళు, నిజంగా దేవతలు. వాళ్ళ గురించి కొందరికి ఎలాగూ తెలుసు. లోకానికంతటికీ తెలియటం నాకు ఇష్టం లేదు. అంచేత వాళ్ళ గురించి వదిలేసి నా గురించి వివరాలు చెప్తాను. రాసుకోండి" అందామె.

నేను ఆసక్తిగా ఆమె వైపు చూశాను. ఆమె చెప్పటం ప్రారంభించింది.

"మా నాన్నగారు సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయి. మా మమ్మీ కూడా చదువుకున్నవారే. ఒకప్పుడు ఉద్యోగం కూడా చేసేవారు. తర్వాత మానేశారట. నాకు ఓ చెల్లెలూ, తమ్ముడూ వున్నారు. పదో ఏటనించీ మమ్మీ నాకు 'డాన్స్' నేర్పించింది. ఆల్బంలో ఫోటోలు చూశారుగా. అందులో ఎక్కువగా నేను 'డాన్స్ ప్రోగ్రామ్స్' ఇస్తున్నపుడు తీసినవే. కాలేజీలో బి.ఎస్సీ చదివేటప్పుడు - ఓసారి

యానివర్సిరీకి నేను 'ఇందిరాగాంధీ' మోనో యాక్షన్ కూడా చేశాను. నేను ఫైనలియర్ చదువుతూండగానే మా మమ్మీ, నాన్నగారు నాకు పెళ్ళి సంబంధాలు చూడటం ప్రారంభించారు. బెంగుళూరు నుంచీ ఓ సంబంధం వచ్చింది. అబ్బాయి ఎయిరిండియాలో పని చేస్తున్నాడు. అతనికి నేను నచ్చాను. కట్నం కానుకలు లేకుండా నన్ను చేసుకోవటానికి అంగీకరించాడు."

"ఆ అబ్బాయి మీకు నచ్చాడా?" మధ్యలో కల్పించుకుంటూ అడిగాను నేను.

"ఊఁ! బాగానే వున్నాడు. కానీ నా అంత తెలుపు కాదనుకుంటాను. నా పరీక్షలు అయిన తర్వాత ముహూర్తం పెట్టిస్తానన్నారు మా నాన్నగారు. తర్వాత అపుడపుడు బెంగుళూరు నించి అతను నాకు ఉత్తరాలు రాస్తూండేవాడు. నేను ఎప్పుడైనా జవాబు రాసేదాన్ని.

"ఓసారి మా ఫాదర్ ఫ్రెండు ఒకాయన - ఏదో పని మీద మా ఇంటికొచ్చారు. అప్పుడు నేను హాల్లోనే ఏదో చదువుకుంటున్నాను. నన్ను చూసి "ఈ అమ్మాయి నీ కూతురే కదూ?" అని అడిగారాయన. నన్ను ఆయనకు పరిచయం చేశారు నాన్నగారు.

"టీవీలో యాక్ట్‌చేస్తావా?" అని అడిగారాయన. నేను నాన్నగారి వైపు చూశాను. ఓసారి టీవీలో నా చేత 'డాన్స్' ప్రోగ్రాం ఇప్పించాలని మా నాన్నగారు చాలా ప్రయత్నాలు చేశారు. కానీ వీలుపడలేదు. ఇప్పుడు అవకాశం దానంతట అదే వచ్చింది. మా నాన్నగారి ఫ్రెండు టీవీలో ఏదో సీరియల్ తీస్తున్నట్టూ అందులో హీరోయిన్ వేషం నా చేత వేయదల్చుకున్నట్టూ చెప్పారు.

"మా నాన్నగారు ఆలోచనలో పడ్డారు. అంతలో ఆయన మళ్ళీ నా వేషం గురించి మరింత వివరంగా చెప్పారు. పదమూడు వారాలపాటు సీరియల్ వస్తుందనీ - నాకు మంచి పేరొస్తుందనీ కూడా చెప్పారు. మమ్మీని పిలిచి విషయాన్ని వివరించారు నాన్నగారు.

"ఓ మూల పరీక్షలు దగ్గరపడుతున్నాయి. ఇప్పుడు ఇవన్నీ ఎందుకు?" అంది మమ్మీ.

"మరేం ఫరవాలేదమ్మా! నెలకు వారం రోజుల చొప్పున రెండు నెలలు. మొత్తం పదిహేను రోజులు పనుంటుంది అంతే. చదువుకీ కాలేజీకి ఎలాంటి ఇబ్బందీ లేకుండా నేను అరేంజ్ చేసుకుంటాను" అని ఆయన హామీ ఇచ్చారు. చివరకు అమ్మా నాన్నా సరే అన్నారు.

"మరి మీకు ఇష్టం లేదా?" అడిగాను నేను మళ్ళీ కల్పించుకుంటూ.

"నాకూ ఇష్టమే. కానీ వాళ్ళ ఇష్టం ముఖ్యం కదా?" అంది శోభ.

"ఊఁ తర్వాతేమయింది?" అడిగాను.

"ఆ తర్వాత ఇరవై రోజులకే షూటింగ్ ప్రారంభమైంది. నాతోబాటు షూటింగ్‌కి మొదట్లో మా మమ్మీ వస్తూండేది. తర్వాత అప్పుడప్పుడు మా సిస్టర్ వచ్చేది. షూటింగ్ అయిన నెలరోజులకే టీవీలో సీరియల్ మొదలైంది. నన్ను అందరూ పొగట్టం ప్రారంభించారు ముఖ్యంగా మా కాలేజీలో ఫ్రెండ్స్ నన్ను 'ప్రత్యేకం'గా చూస్తూంటే నాకు అదోలా వుండేది. ఓసారి మా ప్రిన్సిపాల్ కూడా పిలిచి నన్నెంతో మెచ్చుకుంది.

"అలా నాకు మంచి పేరు, గుర్తింపూ రావటంతో ఇంకా ఇంకా ఎక్కువ సీరియల్స్‌లో నటించాలన్న కోరిక పెరగసాగింది. అప్పట్లో మా ఇంటికి ఎవరెవరో వచ్చి - వాళ్ళు తీసే 'సింగిల్ ఎపిసోడ్స్'లో వేషం వెయ్యమని అడిగేవారు.

"..అప్పుడప్పుడు మమ్మీకి నాన్నగారికీ చెప్పి పర్మిషన్ తీసుకున్నా. తర్వాత తర్వాత వాళ్ళకు చెప్పకుండానే నేను ఒప్పేసుకునేదాన్ని.

"ఓసారి ఓ సింగిల్ ఎపిసోడ్‌లో వేషం వెయ్యటానికి నన్ను నర్సాపురం రమ్మన్నారు. నాతో తమ్ముణ్ణి సాయంపంపించింది మా అమ్మ. రాత్రి షూటింగ్ పదకొండు గంటలకు పూర్తయ్యాక నన్ను కార్లో హైదరాబాదు పంపించారు. నాతోబాటు మేకప్‌మేన్ శంకర్ కూడా అదే కార్లో వచ్చాడు. మాటల సందర్భంలో అతను తనకు చాలామంది సినిమా డైరక్టర్లు తెలుసుననీ - నేను 'ఊఁ..' అంటే వాళ్ళకు పరిచయం చేసి నన్ను 'సినిమా హీరోయిన్'ని చేస్తాననీ చెప్పాడు."

శోభ చెప్పటం ఆపి క్షణం సేపు కళ్ళు మూసుకుంది "మీరు 'ఊఁ..' అనలేదా?" అడిగాను వెంటనే.

ఆమె దిగులుగా చూసి నవ్వుతూ చెప్పింది.

"అనకపోతే బావుండేది. నాకివాళ ఈ గతిపట్టేదికాదు. ఆనాడే పెళ్ళి చేసుకుని హాయిగా ఏ బెంగుళూరులోనే ఉండేదాన్ని"

"మరి" ఆ తర్వాత ఏం జరిగిందో చెప్పమన్నట్టుగా చూశాను.

"అప్పటికే గ్లామర్ ప్రపంచం తాలూకు బలహీనత ఏదో నాలో ఆవహించింది. టీవీ తెరమీద కనిపిస్తేనే నన్ను ఎంతోమంది 'ప్రత్యేకం'గా చూడటం, నాకేదో కొత్తరకం గౌరవాన్ని ఇవ్వటం చూసి గర్వపడేదాన్ని. 'అదే సినీమా తెరమీద కనిపిస్తే?' ఒక్కసారిగా నా ఒళ్ళు గగుర్పొడిచింది. నా మీద నాకే నమ్మకం పెరిగిపోయింది. అవకాశం రావాలేగానీ తప్పకుండా 'హీరోయిన్' అయిపోగలనన్న విశ్వాసం కలిగింది."

"అశోకా హోటల్లో నాకు తెలిసిన డైరెక్టరొకాయన వున్నాడు. నువ్వు 'ఊఁ..' అంటే రేపు అతనికి పరిచయం చేస్తాను' అన్నాడు శంకర్ మళ్ళీ నేను సరేనన్నాను.

మర్నాడు శంకర్ నన్ను ఆ డైరెక్టర్‌కి పరిచయం చేశాడు. అప్పట్లో ఆయన డైరెక్ట్ చేస్తున్న చిత్రంలో ఓ చిన్న వేషం వుందనీ ప్రస్తుతానికి ఆ వేషం చేస్తే నెక్స్ట్ పిక్చర్లో హీరోయిన్ వేషం ఇస్తాననీ చెప్పాడాయన. నాకు ఎగిరి గంతేయాలనిపించింది.

తన స్కూటరు మీదనన్ను మళ్ళీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తూ మధ్యలో ఇందిరాపార్క్‌కి తీసుకెళ్ళాడు శంకర్.

"ఇక్కడికెందుకు తీసుకొచ్చావ్?" అని అడిగాను.

"సినీమాల్లో వేషం ఇప్పించాను. కనీసం అయిస్క్రీం కూడా ఇప్పించవా?" అని అడిగాడు శంకర్.

"రేపు స్వీట్స్ కొనిస్తానుగా" అని సమాధానం చెప్పాను.

"రేపటి పని ఇవాళే చెయ్యాలి. ఇవాల్టిపని ఇప్పుడే చెయ్యాలి అనేది నా సిద్ధాంతం, నువ్వు అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నీకీ సహాయం చేశాను. ఇప్పుడు 'ఐస్క్రీం' కూడా నేనే ఇప్పిస్తాను. పార్కులో ఓ అరగంట కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ 'ఐస్క్రీం' తినేసి వెళ్ళిపోదాం" అంటూ నా సమాధానం కోసం చూడకుండా పార్కులోకి దారితీశాడతను.

"..ఐస్క్రీం తింటూ కబుర్లలో పడ్డాం. నేను చాలా బాగుంటాననీ - మేకప్ చేస్తే నా 'ఫేస్' హీరోయిన్‌లా 'మౌల్డ్' అవుతుందనీ - నన్ను ములగ చెట్టు ఎక్కించాడు శంకర్.

"మద్రాసులో తనకు తెలిసిన పెద్ద డైరక్టర్లు చాలామంది వున్నారు. వాళ్ళకు కూడా పరిచయం చేస్తాననీ చెప్పాడు. నిజంగానే నేనంటే అతనికి అభిమానమని గ్రహించాను. అందుకే అతనేం చెప్పినా సరేనన్నాను. పదిరోజులు గడిచిపోయాక - ఓరోజు సాయంత్రం అతను మా ఇంటికొచ్చాడు. ఏదో టెలీఫిలింలో చిన్న వేషం చేయాలి రమ్మన్నాడు. "ఇంత సడెన్‌గా చెపితే ఎలా? ఇంట్లో ఎవరూ లేరే సాయం పంపిద్దామంటే" అంది మమ్మీ.

"అదేమిటి ఆంటీ అలా అంటారు. నేను లేనా? నేను స్వయంగా తీసుకెళ్ళి మళ్ళీ షూటింగ్ పూర్తికాగానే దగ్గరుండి తీసుకొస్తానుగా!" శంకర్.

"మమ్మీ సరేనంది. నేను అతని వెంట బయల్దేరాను. తిన్నగా అతను నన్ను ఓ పెద్ద హోటల్‌కి తీసుకెళ్ళాడు. ఏదో డ్రింక్ ఆర్డరిచ్చాడు. 'షూటింగ్ అని చెప్పి ఇక్కడికి తీసుకొచ్చావేమిటి?' అని అడిగాను.

'ఇక్కడికని చెపితే మీ వాళ్ళు పంపరని' అన్నాడు.

'నాకు సినిమాలో మంచి వేషం వచ్చే ఛాన్స్ వుందనీ, మర్నాడెవరో డైరక్టరుకు నన్ను పరిచయం చేయబోతున్నాననీ చెప్పాడు. అంతలో కుర్రాడు డ్రింక్స్ తెచ్చి పెట్టాడు. నేను సందేహించాను. ప్రమాదం ఏమీ రాదు. తాగు' అన్నాడు. మామూలు కూల్ డ్రింక్

తెప్పిస్తే తాగుతానన్నాను. అతను వినలేదు. అదికూడా అలాంటిదే అన్నాడు. పైగా పెద్ద పెద్ద హీరోయిన్లంతా రాత్రిళ్ళు తాగితే తప్పు నిద్రపోరని చెప్పాడు. చివరకు నేను తాగకపోతే తను కూడా తాగనని మొండికేశాడు. అలా లొంగిపోయాను.

"ఓ గంట హోటల్లో కబుర్లు చెప్పుకున్నాం. తర్వాత నన్ను బంజారాహిల్స్‌లో వున్న హోటల్‌కి తీసుకెళ్ళాడు. నాకేం అర్థంకాలేదు. తన పేర రూమ్ తీసుకున్నాడు" చెప్పటం ఆపి నావైపు చూసింది శోభ.

"ఊఁ చెప్పండి" ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అడిగాను.

తర్వాత జరిగిందేమిటో మీరు ఊహించగలరుగా. మీరు 'వెండితెర సాక్షి'గాలో రాసిన చాలా మంది అమ్మాయిలు మోసపోయినట్టే నేనూ మోసపోయాను. కల్లబొల్లి కబుర్లు చెప్పి డ్రింక్ మత్తులో వున నన్ను నాశనం చేశాడు. నేను ఏడ్చాను. "అన్నీ మన మంచికే" అన్నాడు. తాను ఆ పాపం చేసినందుకు పరిహారంగా నన్ను తప్పనిసరిగా పెద్ద హీరోయిన్‌ని చేస్తానన్నాడు. ఎన్నో సినిమాలకు తాను 'మేకప్‌మాన్'గా పనిచేస్తున్నట్టూ ఇండస్ట్రీలో తనకెంతో పలుకుబడి వున్నట్టూ చెప్పాడు. ఆ మాటలన్ని నమ్మేశాను. "

"మర్నాడు డైరెక్టరు దగ్గరకు తీసుకెళ్ళాడా?" మధ్యలో కల్పించుకుని అడిగాను.

"ఆ వెళ్ళాను. ఆయన నన్ను తనతో మద్రాసు రమ్మన్నాడు"

"ఆయన పేరేమిటో తెలుసుకోవచ్చునా?"

"..." చెప్పింది.

"ఆయన వేషం ఇచ్చాడా మరి?" అడిగాను ఆసక్తిగా.

"ఇచ్చాడు. అదీ చిన్న వేషమే. దానికోసం నేనూ మా తమ్ముడూ పదిరోజులు మద్రాసులో వుండవలసి వచ్చింది. ఆ పదిరోజుల్లోనూ నేనున్న హోటల్‌కి కారుపంపి నాలుగుసార్లు నన్ను ఒంటరిగా తన రూమ్‌కి పిలిపించుకున్నాడు" చెప్పిందామె.

"ఎందుకు?"

నన్ను ఓ అమాయకుణ్ణి చూసినట్టుగా చూసిందామె. "అది కూడా చెప్పాలా?" అంది. అర్థం చేసుకున్నాను.

"అయామ్ సారీ. సినీమా వేషాలకోసం మీరు మీ జీవితాన్ని బలిపెట్టుకున్నారన్నమాట."

"అది కాదు బలి. ఆ శంకరం మాటలు నమ్మి వాడితో కాపురం పెట్టటం బలి" ఆమె కళ్ళల్లో పేరుకున్న కసి, పగా కనిపించాయి.

నేను ఆశ్చర్యంగా చూశాను.

"అస్తమానూ వాడు మా ఇంటికొచ్చి సినీమా వేషాల గురించి మాట్లాడటం, తనతో స్టూడియోలకు తిప్పుకోటం మా ఇంట్లో వాళ్ళకి నచ్చలేదు. అదే సమయంలో ఓ టీవీ సీరియల్లో నాకు అతను వేషం ఇప్పించాడు. మా వాళ్ళు ఇంక వేషాలు వెయ్యొద్దన్నారు. నాలో మానసిక సంఘర్షణ చెలరేగింది. చివరకు వెండి తెర గ్లామరే! నన్ను ఒక విలాసవస్తువుగా వంటింటి కుందేలుగా చూడటం ప్రారంభించాడు.

"మరి మీ వాళ్ళు వూరుకున్నారా అతనితో మీరు వుంటే?" అడిగాను.

"ముందు నయానా భయానా చెప్పారు. పోలీసు కంప్లయింటు కూడా ఇచ్చారు. కానీ నేను మేజర్ని కావటం వల్ల ఎవరూ ఏమీ చేయలేకపోయారు. అప్పటినుంచీ నేను మళ్ళీ మా ఇంటి గడప తొక్కటం మానేశాను."

"ఊఁ... ఆ తర్వాత?" అడిగాను వెంటనే.

"నాకు వేషాలు రావటం తగ్గిపోయాయి. నా గురించి అతను పట్టించుకోవటం మానేశాడు. రోజూ తాగి రావటం - తన అవసరం తీర్చుకోవటం. పైగా నన్ను పెళ్ళి చేసుకున్నాక తనకు అవకాశాలు తగ్గిపోయాయనీ నేను నష్టజాతకురాలిననీ తిట్టేవాడు.

ఎప్పుడైనా ఉక్రోషంతో నేను ఏదైనా అంటే నన్ను చిత్రహింసలు పెట్టేవాడు. అతనితో ఆర్నెల్ల కాపురం నరకమైపోయింది. సినీమా తారనవ్వాలన్న నా కోరికను చంపేశాడు. నా వాళ్ళకు నేను శాశ్వతంగా దూరమైపోయాను. రానురాను ఇల్లుగడవటం కష్టమయ్యేది. తనమటుకు తాను వీధిలో ఎక్కడో తినేసి వచ్చేవాడు. నా గురించి పట్టించుకునేవాడేకాదు.

"ఇందుకేనా నన్ను పెళ్ళి చేసుకున్నది?" అని అడిగాను. మా మధ్య మాటామాటా పెరిగింది. నా మీద చెయ్యి చేసుకున్నాడు. నేను చస్తేనేగానీ అతనికి మనశ్శాంతి ఉండదన్నాడు. నాకు పౌరుషం వచ్చింది. చేజేతులా బంగారం లాంటి నా జీవితాన్ని నాశనం చేసుకున్నందుకు ఆ క్షణంలో నా మీద నాకే అసహ్యం వేసింది. ఆ రాత్రి కిరసనాయిలు ఒంటి మీద పోసుకుని ఆత్మహత్యకు తలపడ్డాను" అప్పటికే ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు చేరుకున్నాయి.

నేను జాలిగా చూస్తూండిపోయాను.

నెమ్మదిగా కళ్ళు తుడుచుకుని ఆమె మళ్ళీ చెప్పసాగింది "అక్కడకూడా దేవుడు నాకు అన్యాయం చేశాడు. నన్ను ఎవరో వీధిలో పోతున్నవాళ్ళు చూసి మంటలార్పి హాస్పిటల్లో చేర్చారు. మర్నాడు ఉదయానికి అమ్మా నాన్న ఎలా తెలిసిందో వాళ్ళకి హాస్పిటల్‌కి వచ్చారు. కన్నీరు మున్నీరుగా ఏడ్చారు. నేను చచ్చిపోతే బాగుండునని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకున్నాను ఎలాగైనా నన్ను బతికించమని అమ్మ కూడా ఎంతో మంది దేవుళ్ళని ప్రార్థించింది. మా అమ్మ దేవత కనక, పుణ్యాత్మురాలు కనుక, ఆవిడ ప్రార్థనల్నే ఆ దేవుడి విన్నాడు. నేను ఏడుస్తూ రోజులు ఈడుస్తున్నాను."

ఆమె కన్నీరు చూసి నేను చలించిపోయాను. కొన్ని నిమిషాలపాటు ఆ గదిలో నిశ్శబ్దం చోటు చేసుకుంది. ఇక ఆ తర్వాత ఏం మాట్లాడాలో తెలీక "వెడతాను" అంటూ లేచాను.

"నా కథ 'సితార'లో రాస్తారు కదూ?" దీనంగా చూసి అడిగిందామె.

ధైర్యంగా ముందుకొచ్చి తన కథ రాయమని తనకి తానుగా ఆమె అడిగినందుకైనా ఆమె గురించి అందరికీ తెలియచేయాలని నిర్ణయించుకున్నాను. 'గాంధీగారి దేశంలో గజానికో గాంధారి కొడుకుంటే - సినీమా రంగంలో అంగుళానికో కీచకుడుంటాడు' అని ఓసారెప్పుడో ఓ పత్రికలో చదివిన వాక్యాన్ని గుర్తు చేసుకుంటూ - ఆమె వైపు సానుభూతిగా చూసి బయటికొచ్చాను.

**(వచ్చేనెల మరో కథనం)**

Post your comments

*(పాతికేళ్ళ క్రిందట సితారలో ధారావాహికగా వచ్చిన ఈ కథనాలు*

*రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)*